క్లుప్తంగా

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ వేదికపై ఆదివారం ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశిష్ట ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. ఆలయ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆర్‌ఎల్ ప్రసాద్ నేతృత్వంలో మెజీషియన్స్ డాక్టర్ ఆర్నల్, జేవీ ఆర్, అద్దంకి నాగరాజు, డాక్టర్ పి.వి.రామ్‌కుమార్, నాగేంద్ర చేపట్టిన ఇంద్రజాల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. మెజీషియన్స్‌ను ఆర్.ఎల్. ప్రసాద్ సత్కరించారు.

ఉత్సాహంగా దేశభక్తి గీతాలాపన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో భరతమాత పూజా దినోత్సవాల్లో భాగంగా ఆదివారం జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులకు చేతిరాత, ఇంద్రజాలం, దేశ భక్తి బృంద గానం పోటీలు నిర్వహించారు. సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షత వహించగా, ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు వచ్చే నెల 26న బహుమతులు అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని పలు పాఠశాలల నుంచి 1,755మంది విద్యార్థులు హాజరవ్వగా, ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జైపూర్ వెళ్లిన నగర కమిషనర్

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్టడీ టూర్ నిమిత్తం జైపూర్ వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజస్థాన్ రాజధాని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి దీపాల పర్యవేక్షణ వ్యవస్థ, రోడ్ల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఇతర ఉత్తమ పద్ధతుల అమలు పరిశీలన, అధ్యయనం కోసం సోమ, మంగళవారాల్లో జైపూర్‌లో పర్యటించనున్నారు.

హైకోర్టు ఏజీపీకి సన్మానం



లక్ష్మీపురం: చిన్న వయస్సులోనే హైకోర్టు ఏజీపీగా తాడిశెట్టి వెంకట ఆనందరావు నియమితులవ్వడం చాలా సంతోషదాయకంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. అనంతరం వెంకట ఆనందరావును సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, రమణ, మరియదాసు, న్యాయవాదులు శివ కేశవ, కిరణ్ అభినందలు తెలిపి ఘనంగా సత్కరించారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'ప్రత్యేక హోదాపై హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు' పై సంస్థ సీనియర్ సభ్యులు ఎల్.మురళీకృష్ణ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ పార్లమెంటులో అప్పటి ప్రధాని మన్మోహన్ చేసిన ప్రకటనకు విలువ లేదని వాదించటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా తప్పనిసరి అవసరమని చెప్పారు. సమావేశంలో సీనియర్ విశ్లేషకులు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి మాజీ జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు, రాజశేఖర్, సదాశివం ప్రసంగించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

లక్ష్మీపురం: ఫోన్ మాట్లాడుకుంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి మూడు రోజులుగా తిరిగి రాక పోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. కొత్తకాలనీకి చెందిన బొమ్మిడి చిరుపవన్ కుమార్ గుంటూరు మిర్చి యార్డులో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య బొమ్మిడి మనోహరి, వీరువురికి ఇద్దరు సంతానం ఉన్నారు. అయితే గత కొన్ని రోజులుగా చేసిన అప్పులు ఎలా తీర్చలంటూ ఆవేదన చెందుతు ఉండేవాడు. అయితే నవంబర్ 28వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో ఫోన్ రావడంతో ఫోన్ మాట్లాడుకుంటూ బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. దీంతో భార్య చుట్టు పక్కల, బంధుమిత్రుల ఇళ్లల్లో విచారించి ఎంతకు ఆచూకి తెలియక పోవడంతో ఆదివారం రాత్రి నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలేమో కార్పొరేషన్‌లో..

పనులేమో సార్ల ఇళ్లల్లో

- పారిశుద్ధ్య కార్మికులకు ఇతర విధులు కేటాయింపు
- కొన్ని ప్రాంతాల్లో శానిటేషన్ సిబ్బంది మస్టర్ పలికి వెళ్లిపోతున్న వైనం
- సిబ్బంది రేషనలైజేషన్ చేయాలని కమిషనర్ నెల రోజుల క్రితం ఆదేశం
- ఇంత వరకు రేషనలైజేషన్ చేయని ప్రజారోగ్యధికారులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో వింత పరిస్థితి. పేరుకు పారిశుద్ధ్య కార్మికులున్నా.. విధుల్లో నామమాత్రంగా ఉంటున్నారు. దీంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోతున్నాయి. అందుకు అధికారుల ఇళ్లల్లో పనులకు, డెప్యూటేషన్‌పై ఇతర అధికారుల వద్ద పనులు చేయిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. నగరంలో ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం జరగడం లేదు. అరకొర సిబ్బందితో శానిటేషన్ మెరుగుపడకపోవడంతో అదనంగా మరో వంద మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు... ప్రజారోగ్యధికారులు.

కమిషనర్ పరిశీలనలో వెలుగులోకి..

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గుంటూరు నగరంలో స్పెషల్ శానిటేషన్ పేరుతో 90 రోజులు ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నగరపాలక సంస్థలో పనిచేసే అధికారులందరికి ప్రత్యేకంగా విధులు కేటాయించారు. ఉదయానే మస్టర్ పాయింట్‌కి వెళ్లి కార్మికుల మస్టర్ పరిశీలించడంతో పాటు శానిటేషన్ మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించిన విషయం తెలిసిందే... గత కొద్ది రోజుల క్రితం నాజ్‌సెంటర్ మస్టర్ పాయింట్‌ను స్వయంగా పరిశీలించిన కమిషనర్‌కు విస్తు పోయే నిజాలు తెలిశాయి. మస్టర్‌లో ప్రతి రోజు హాజరు పడుతున్న సిబ్బందికి.. ప్రత్యక్షంగా విధుల్లో ఉన్న సిబ్బందికి మధ్య వ్యత్యాసం రావడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది డెప్యూటేషన్‌పై వేరో చోట పనిచేస్తున్నారని చెప్పడంతో పారిశుద్ధ్య కార్మికులు డెప్యూటేషన్‌పై ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో వారిని అందరిని తిరిగి శానిటేషన్ విధులకు కేటాయించాలని ఆదేశించారు. అది కూడా ఆశించిన స్థాయిలో జరగలేదనే చెప్పుకోవచ్చు.



నాజ్‌సెంటర్‌లో మస్టర్ రిజిస్టర్ పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు(ఫైల్)

రెండు వేల మంది కార్మికులున్నా..

నగర పాలక సంస్థ పరిధిలో పర్మినెంట్, అప్కాస్ పద్ధతిలో రెండు వేలకు పైగా శానిటేషన్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. తక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ మంది వర్కర్లు, ఎక్కువ జనాభా ప్రాంతాల్లో తక్కువ మంది శానిటేషన్ వర్కర్లు పనిచేస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. దీనిపై కమిషనర్ సిబ్బంది రేషనలైజేషన్ చేయాలని ఆదేశించినా ఇంత వరకు చేయలేదు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు మామూళ్లు ఇస్తే చాలు..

శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు మామూళ్లు ఇస్తే పర్మినెంట్ వర్కర్లు విధులు చేయకపోయిన వారికి ప్రతి రోజు మస్టర్ పడిపోతుంది. ఇదే పద్ధతిలో అప్కాస్ పద్ధతిలో పనిచేసే వర్కర్లు దగ్గర కూడా నడుస్తుందనే చెప్పుకోవచ్చు. పారిశుద్ధ్య కార్మికులు ఎవరైన చెప్పకుండా సెలవులు పెట్టిన వారికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చుక్కలు చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారు అడిగినంత ఇస్తే ఓకే లేకపోతే... ఎంహెచ్‌ఓ, సీఎంహెచ్‌ఓ, కమిషనర్ దగ్గరకు వెళ్లాలంటూ కార్మికులను భయపెడుతున్నారు.

ఈ వారంలో రేషనలైజేషన్ ప్రక్రియ

సిబ్బంది రేషన్‌లైజేషన్ ప్రక్రియ తుది దశకు వచ్చింది. ఈ వారంలో సిబ్బంది రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి..ఎక్కడ సిబ్బంది తక్కువ ఉన్నారో... అక్కడికి సర్దుబాటు చేస్తాం.

– డాక్టర్ శోభారాణి, సీఎంఓహెచ్

తుపాను ప్రభావంతో ముందస్తు చర్యలు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, విభాగాధిపతులను ఆదివారం ఆదేశించారు. తుఫాన్ ప్రభావం వలన నగర ప్రజలకు ఏ సమస్య ఎదురైనా తక్షణం స్పందించడానికి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా, నిలిచిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన బెయిల్ అవుట్ చేసేలా మోటార్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సమస్యలుంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103కి కాల్ చేయవచ్చని కోరారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కమిషనర్ ఓబులేసు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 0863-2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని ప్రజలు స్వయంగా వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు.

గంజాయి కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళదాస్‌నగర్‌కు చెందిన మాదాసు శాంతిరాజు పొన్నూరు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద గంజాయి కలిగి ఉన్నాడని పక్కా సమాచారంతో దాడిచేసి శాంతిరాజును అదుపులోకి తీసుకుని అతని నుండి అరకిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్య సిద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: యోగా సాధన ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని యోగ గురువులు మండలనేని సరస్వతి, గుంటుపల్లి సాంబశివరావు పేర్కొన్నారు. శ్రీసరస్వతీ ధ్యాన యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం చుట్టుగుంట సెంటర్‌లోని శ్రీపోలేరమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో ఏర్పడుతున్న అధిక ఒత్తిడి, అనారోగ్య సమస్యల నుంచి ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు యోగా సాధన గొప్ప ఔషధంలా పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు గద్దె శివశంకరరావు, రామకృష్ణారావు, శేషిరెడ్డి పాల్గొన్నారు.

ఆస్టియో పోరోసిస్ వ్యాధిపై అవగాహన ఉండాలి

లక్ష్మీపురం: వృద్ధాప్యంలో చాలా మందిని ఇబ్బంది పెట్టే ఆస్టియో పోరోసిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు కార్తీక్ కోట అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎముకలకు సంబంధించిన వ్యాధులలో ఆస్టియోపోరోసిస్ ప్రధానమైనదని చెప్పారు. రోజు వ్యాయామం చేస్తుంటే ఆస్టియో పోరోసిస్ రాకుండా నివారించవచ్చన్నారు. అనంతరం పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

నగరంపాలెం: కార్తిక మాసం సందర్భంగా నందివెలుగు రోడ్డు వస్తనగర్‌లోని శ్రీకామ్యసిద్ధి పద్మావతి గోదా దేవి వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. సుమారు 300 మందికి పైగా దంపతులు వ్రతాన్ని ఆచరించారు. ఆలయం నాలుగు వైపుల ఉన్న ఉప ఆలయాల్లోని స్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా కార్తిక మాసంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. టీటీడీ అందించిన విగ్రహాలను ఆలయంలో ప్రతిష్టించామని తెలిపారు. టీటీడీలో జరిగే కార్యక్రమాలను ఈ ఆలయంలో కొనసాగుతాయని చెప్పారు. అలాగే ఏటా బ్రహ్మోత్సవాలు, కల్యాణాలు, నిత్యాన్నదానం చేస్తామని చెప్పారు. ఆలయ కార్యదర్శి శేషగిరి, కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వ్రతంలో పాల్గొన్న దంపతులు

గ్రామీణ నాటక రంగ వికాసానికి కొడాలి కృషి

నగరంపాలెం: గ్రామీణ నాటక రంగ వికాసానికి నాటక రచయితగా కొడాలి గోపాలరావు కృషి చిరస్మరణీయమని నాటక రంగ పరిశోధకులు కందిమళ్ల సాంబశివరావు అన్నారు. లాడ్జిసెంటర్‌లోని బీఈడీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తోన్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై కొడాలి గోపాలరావు నాటక సాహిత్యంపై ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ గ్రామసీమల్లోని రైతులు, రైతు కూలీల సమస్యలను కొడాలి తన నాటకాల్లో చూయించేవారని అన్నారు. తెలుగు నాటక రంగంలో కొడాలి, కొర్రపాటి గంగాధరరావు శతాధిక నాటక రచయితలుగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రాష్ట్ర అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, నాటక రచయిత నాగభూషణం, మృత్యుంజయరావు, సంగిరెడ్డి హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాంబశివరావు

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి

- ఎలాంటి త్యాగాలకైన ముస్లిం సమాజం సిద్ధం కావాలి
- ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ రహమానీ

లక్ష్మీపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ మౌలానా ఉమ్రైయిన్ మెహఫూజ్ రహమానీ కోరారు. స్థానిక పప్పు బజార్‌లో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్న మజ్లీస్, జమియతుల్ ఉలేమా, ఆల్ ఇండియా మిల్లి కౌన్సిల్, పలు ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లులో 44 రకాల సెక్షన్‌లు ఉన్నాయని వివరించారు. ఆ 44 రకాల సెక్షన్‌లలో ముస్లింల పూర్వీకుల ఆస్తులు పూర్తిగా రద్దు చేసే విధంగా ఉన్నాయని చెప్పారు. ఈ బిల్లు కేంద్రంలో తక్షణమే రద్దు చేసేంత వరకు పోరాటం చేయాల్సి ఉందన్నారు. కేంద్రం తక్షణమే వక్ఫ్ 1991 బిల్లును యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోని, వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సవరణ బిల్లులో ఉన్న సెక్షన్‌లను మార్పులు చేస్తూ కేంద్రానికి మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రం ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా వక్ఫ్‌బోర్డు అనేది వక్ఫ్ భూములు అనేవి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని, వక్ఫ్ భూములు పూర్వం ముస్లిం నవాబులు, ధనవంతులు ముస్లిం సమాజం అభ్యున్నతి కోసం ఇచ్చినవని వివరించారు. రానున్న రోజుల్లో వక్ఫ్ బిల్లును వ్యతిరేకించేందుకు దేశ వ్యాప్తంగా ముస్లిం సమాజం ఎలాంటి పోరాటానికైన సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

వక్ఫ్ సవరణకు బిల్లు రాకుండా కృషి:

వక్ఫ్ సవరణ బిల్లులో మార్పులకు కాకుండా నావంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. ముస్లిం మత పెద్దలను, ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. ముస్లింలకు అండగా ఉంటానని చెప్పారు. ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డును, ముస్లిం మత పెద్దలను జాయింట్ పార్లమెంట్ కమిటీ సభ్యులు, ఎంపీ శ్రీ కృష్ణదేవరాయులతో మాట్లాడించడం జరిగిందన్నారు. అలాగే 15 రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దకు ముస్లిం మత పెద్దలను, ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు సెక్రటరీని తీసుకు వెళ్ళి మాట్లాడించి ముస్లిం సమాజానికి ఎలాంటి ఇబ్బదులు కలుగ కుండా తగిన విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ముఫ్తి అబుబకర్ జాబిర్, ముఫ్తి అబ్దుల్ బాసీత్, ముఫ్తి షరీఫ్, మౌలానా ఇస్మాయిల్, మౌలానా మున్వర్, మౌలానా అబ్దుల్ ఖవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ మౌలానా

రహమానీని కలిసిన ఎంపీ కృష్ణదేవరాయులు..

గుంటూరు విచ్చేసిన ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ మౌలానా ఉమ్రైయిన్ మెహఫూజ్ రహమానీని, నరసరావుపేట ఎంపీ, వక్ఫ్ సవరణ బిల్లు జాయింట్ పార్లమెంట్ కమిటీ సభ్యులు, కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలసి ఇక్బల్ మసీదులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కేంద్రం దృష్టికి ముస్లింల వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా చర్యలు తీసుకుంటానని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళతానని కృష్ణదేవరాయులు హామీ ఇచ్చారు.







శరవేగంగా పనులు

గుంటూరు నగరంలో మూడు వంతెనల వద్ద పనులు రైల్వే అధికారులు చేపట్టారు. రైల్వే మూడు లైన్ నిర్మాణానికి మూడు వంతెనలు కూల్చివేసి వాటి స్థానంలో కొత్త వంతెనలు చేపట్టనున్నారు. వీటితో పాటు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అంచనాలు రూపొందించిన పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఆదివారం పాత వంతెనలను పొక్లెయిన్ సాయంతో కూల్చివేసే పనులు చేపట్టారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

అంగడి చెన్నయ్యకు ఘన నివాళి

లక్ష్మీపురం: ప్రజలను పాలిస్తున్నా పాలక వర్గాలు ప్రజల కష్టాల గురించి, ప్రజలు పడుతున్న ఇబ్బందులు పట్టడం లేదని దేశంలోని సహజ వనరులను, ఖనిజాలను పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు కిషోర్ బాబు అన్నారు. చుట్టుగుంట సెంటర్‌లోని అంగడి చెన్నయ్య స్థూపం వద్ద వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సభకు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ 70 శాతంపైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నా రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే వ్యవసాయం ఎంత దుర్భరంగా తయారయ్యిందో అర్థం అవుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చేరుకూరి సత్యనారాయణ, రైతు కూలీ సంఘ నాయకులు వి.వీరబాబు, ఎం.శోభారాణి, జిల్లా నాయకులు నీలాద్రి రాంబాబు, మారేళ్ల అంజిరెడ్డి, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కె.కోటేశ్వరరావు, వెంకటాద్రి పాల్గొన్నారు.



రైతు కూలీ సంఘ మహాసభల సావనీర్‌ను ఆవిష్కరించిన సీపీఐ(ఎంఎల్) నాయకులు

హోటల్ పై నుంచి పడి యువకుడి మృతి

లక్ష్మీపురం: ప్రముఖ హోటల్‌పై నుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. నెహ్రూనగర్ 9వ లైన్ ప్రాంతానికి చెందిన గుర్రం హేమంత్ కుమార్(27) మెడికల్ రిప్రజెంటిటివ్‌గా చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ లో మెడికల్ రిప్రజెంటిటివ్‌ల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వచ్చిన వారికి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న హోటల్‌లో వసతి గృహం కల్పించారు. హేమంత్‌తో పాటు మరి కొంత మంది తోటి సిబ్బందితో కలసి రెండో అంతస్తు గదిలో ఉన్నారు. అయితే శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో హేమంత్ కుమార్ కిటికిలో నుంచి కిందకు పడి తలకు తీవ్రమైన గాయాలు అయి అపస్మార స్థితిలోకి వెళ్లాడు. దీన్ని గమనించిన తోటి సిబ్బంది ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. హేమంత్ కుమార్ తండ్రి గుర్రం సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.